క్లుప్తంగా

సీఎంతో సెల్ఫీ



సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: పీఎం పాలెం క్రికెట్ స్టేడియంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జీవీఎంసీ 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి సెల్ఫీ తీసుకున్నారు. సీఎంతో సెల్ఫీ దిగడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.

క్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు



వాక్య సందేశమిస్తున్న పాస్టర్ కామినాయుడు

సీతంపేట: గాడ్ మెస్సీయా సంఘం వ్యవస్థాపకుడు, పాస్టర్ జి.కామినాయుడు ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లోని సంఘ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక వాక్యం, దైవ సందేశం ఇచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు క్రీస్తు ఆరాధకులు, సంఘ సభ్యులు ఏసును స్తుతిస్తూ గీతాలు ఆలపించి, ప్రార్థనలు చేశారు.

రాజశ్యామల సుదర్శన యజ్ఞంపై ప్రచారం



ప్రచార ఆటో

మురళీనగర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీమహాలక్ష్మి యజ్ఞంపై కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు గురువారం ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ యజ్ఞం ఈ నెల 12 నుంచి 17 వరకు విజయవాడలో నిర్వహిస్తారని, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రచారం ప్రారంభించినట్లు ఆలయ అర్చకుడు శేషాచార్యులు చెప్పారు. ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యాల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు అత్యధిక సంఖ్యలో తిలకించాలని ఆయన కోరారు.

సందడిగా సమ్మర్ క్యాంప్



లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సందడిగా సాగుతోంది. గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. దీనిని సచివాలయ మహిళా పోలీస్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానాన్ని పంచే నేస్తాలని చెప్పారు. ఖాళీ సమయాల్లో స్థానిక లైబ్రరీకి వచ్చి నచ్చిన పుస్తకాన్ని చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వై.పద్మజ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా పుస్తక పఠనం

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పిల్లలకు కథలు చెప్పారు. పుస్తకాలు చదివించారు. రిసోర్స్ పర్సన్ ప్రతిమతో డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పుస్తకాలు చదివి, ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, లైబ్రేరియన్ రాజేంద్రవర్మ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూలాలకు చేరిన డస్ట్‌బిన్లు

- శిథిలావస్థకు చేరి.. మరమ్మతులకు నోచుకోని వైనం
- పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది



సీతమ్మధార రైతుబజార్ పక్కనున్న రోడ్డులో శిథిలమైన డస్ట్ బిన్



తలకిందులుగా ఉన్న డంపర్ బిన్.. పక్కన పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: నగరం మరింత సుందరంగా తయారవుతోంది. పరిసరాల పరిశుభ్రతకు, మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అధికారులు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆ దిశగా చర్యలు కూడా చేపడుతున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. జీవీఎంసీ 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డంపర్, డస్ట్ బిన్లు మూలకు చేరుతున్నాయి. అవి శిథిలావస్థకు చేరడం ఈ పరిస్థితికి కారణం. అలా పాడైన డస్ట్ బిన్లను ఓ పక్కన పడేయడంతో వాటి వద్దే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. సీతమ్మధార రైతుబజార్ పక్కనున్న రహదారిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ ఏర్పాటు చేసిన వీల్ డస్ట్ బిన్‌కు పెద్ద రంధ్రం ఏర్పడి మరమ్మతులకు నోచుకోలేదు. వారం రోజులుగా ఇదే పరిస్థితి. సంబంధిత సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. రైతుబజార్ పక్కనున్న ఆక్సిజన్ టవర్స్ గేటు వద్ద ఏర్పాటు చేసిన డంపర్ బిన్ తలకిందులుగా పెట్టి ఉంది. దీంతో దాని పక్కన చెత్త, ఇతర వ్యర్థాలు పారబోస్తున్నారు. వాటిని కుక్కలు, పశువులు రోడ్డుపైకి లాగి చెల్లాచెదురు చేస్తుండటంతో పరిసరాలు పాడవుతున్నాయి. చెత్త నుంచి దుర్వాసన రావడంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి డస్ట్ బిన్లను వినియోగంలో ఉంచాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

24వ వార్డులో పలు చోట్ల డస్ట్ బిన్లు పాడయ్యాయి. వాటి పక్కన, రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య అధికారులు స్పందించి పాడైన డస్ట్ బిన్లకు మరమ్మతులు చేపట్టాలి. చెత్త పేరుకుపోకుండా చూడాలి.

– బి.శ్రీను, సీతమ్మధార

జోరుగా ఎన్‌సీడీ-సీడీ సర్వే



డాక్టర్ సనపల రాజేంద్ర

కంచరపాలెం: కప్పరాడ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 17 సచివాలయాల ప్రాంతాల్లో అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ-సీడీ) సర్వే జోరుగా సాగుతోంది. 14 మంది ఆరోగ్య కార్యకర్తలు, 17 మంది ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి సనపల రాజేంద్ర గురువారం తెలిపారు. సర్వేలో భాగంగా బీపీ, సుగర్, గుండె జబ్బులు, హార్మోన్ సమస్యలు, రక్తహీనత, కంటి సమస్యలు, క్యాన్సర్, మానసిక వ్యాధులు, కిడ్నీ సమస్యలు, ఊబకాయం, బీఎంఐ, దంత తదితర సమస్యలను గుర్తించి, ఎన్‌సీడీ-సీడీ యాప్‌లో నమోదు చేసి ప్రతి ఒక్కరికీ ఒక ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఎకౌంట్(ఏబీహెచ్‌ఏ) ఐడీని జనరేట్ చేస్తారని చెప్పారు. ఈ ఐడీ కోసం మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఓటీపీ చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ ఐడీ చేయించుకోవడానికి ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ ఈ ఐడీ ఉండాలని, రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా తప్పనిసరిగా అవసరమవుతుందని వివరించారు. ఆన్‌లైన్‌లో ఐడీ ఎంటర్ చేయగానే ఆ వ్యక్తి వ్యాధులు, మందులకు సంబంధించిన పూర్వ చరిత్ర తెలుస్తుందన్నారు. దీనివల్ల చికిత్స చేయడం తేలిక, సరియైన చికిత్స అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని డాక్టర్ రాజేంద్ర కోరారు. ఎన్‌సీడీ సీడీ యాప్‌లో మొత్తం 45,851 మంది జనాభా మ్యాప్ అయ్యారని, 30,597 మంది ఐడీలు జనరేట్ అయ్యాయని, ఇంకా 15,254 ఐడీలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇందులో వలస వెళ్లిన వారు, చనిపోయిన వారు, అందుబాటులో లేనివారు 300 మంది ఉంటారని ఆయన చెప్పారు.

అక్రమ నిర్మాణాలు తొలగించండి

దాబాగార్డెన్స్: అక్రమ నిర్మాణాలు తొలగించాలని జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం రామాలయం వీధికి చెందిన చిల్లా వెంకటస్వామి జీవీఎంసీ అధికారులను కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు గ్యాస్ కంపెనీ రోడ్డులోని ఒక ఇంటి యజమాని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. 2019 మే నెల 10వ తేదీన జీవీఎంసీ సిబ్బంది వచ్చి తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. కొంత భాగం తొలగించిన అనంతరం భవన యజమానులు, బంధువులు టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై దౌర్జన్యం చేసి తొలగింపును అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా పోలీసులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై జీవీఎంసీ స్పందనలో ఫిర్యాదు చేయగా కోర్టులో కేసు ఉందని చెప్పి తొలగింపు చర్యలు నిలుపుదల చేశారన్నారు. గత మార్చి 11న కోర్టు కేసు కొట్టివేస్తూ డిక్రీ జారీ చేసిందన్నారు. ఈ విషయమై ఈ నెల 2వ తేదీన జీవీఎంసీ స్పందనలో మళ్లీ ఫిర్యాదు చేసినా, అధికారులు స్పందించలేదని ఆరోపించారు.

మనిషి కవి గోపి



కవి గోపికి పురస్కారం ప్రదానం చేస్తున్న హర్షవర్ధన్, రఘురామారావు

సీతంపేట: కవిత్వం అంటే మనిషిని కలిసినట్టు ఉండాలని భావించే మహోన్నత వ్యక్తి, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జగదీశ్వరి ఫౌండేషన్ 2020 సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథి రచయిత వి.హర్షవర్ధన్ చేతుల మీదుగా కవి గోపికి జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ మనిషి కవి గోపి అని, ఆయన రాసిన కవితా సంకలనం చదివితే ఆయన దృక్పథం, ఆలోచన తెలుస్తుందన్నారు. జగదీశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించి, వారి కాళ్లపై వారి నిలబడేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2019లో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. తన భార్య జగదీశ్వరికి సాహిత్యం, సంగీతంపై ఎంతో మక్కువని, ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏటా విశిష్ట సాహితీవేత్తలకు జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అచీవర్స్ డే విజయవంతంపై ఏయూ వీసీ హర్షం



కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఆచార్యులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల జాబ్స్ అచీవర్స్ డే విజయవంతం కావడంపై వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, వలంటీర్లతో వీసీ గురువారం ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారి సంపూర్ణ కృషితోనే ఈ ఏడాది విద్యార్థులకు అత్యధిక ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా పనిచేయాలని సూచించారు. విద్యార్థుల ఉన్నతికి చేస్తున్న కృషికి వీసీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టీ, పాలక మండలి సభ్యురాలు ఆచార్య శోభశ్రీ, ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: ప్రజలకు సేవలందించడంలో జీవీఎంసీ జోన్-5 అధికారులు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధిలో ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ ప్రజలు తమ సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి కోసం అధికారులను వారి ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలియజేయవచ్చు. ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు నేరుగా అధికారులకు వినతి పత్రాలు అందజేయవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 పబ్లిక్ ఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 ఎఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-ఏ డీమ్డ్ పీఐవో(ఇంజినీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (ఇంజినీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో)	70932 87310
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో	99480 95520
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డిప్యూటీ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్)	99123 49448
కె.శైలజ	టీపీఆర్‌వో, ఏపీడీ డీమ్డ్ పీఐవో (యూసీడీ)	97013 85284

నేటి నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

సీతమ్మధార: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుంది. 14 నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆసక్తి గల వారు వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించవచ్చు.

అధినేతకు ఆత్మీయ స్వాగతం





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

- నగర పర్యటనకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీఎం పాలెం డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హెలీప్యాడ్ వద్ద నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ అనుబంధ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అధినేతకు ఆత్మీయ స్వాగతం పలికారు.

రోడ్డెక్కిన మురుగుతో ఇబ్బందులు



సీతంపేట రాధాకృష్ణ ఆలయం రోడ్డులో షాపుల ముందు నిలిచిపోయిన మురుగు నీరు



డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

సీతంపేట: మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రాధాకృష్ణాలయం రోడ్డులో మురుగు నీరు రోడ్డెక్కింది. గురువారం ఉదయం నుంచి రోడ్డుపై నుంచి మురుగు నీరు నిరంతరాయంగా ప్రవహిస్తూనే ఉంది. డ్రెయిన్‌లో వ్యర్థాలు సక్రమంగా తొలగించక పోవడంతో దానిలోని మురుగు నీరు రహదారిపైకి చేరింది. షాపుల ముందు మురుగు నిలిచిపోవడంతో వ్యాపారం దెబ్బతింటోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తున్నా.. అప్పటికప్పుడు చెత్త తొలగించి డ్రెయిన్ క్లియర్ చేస్తున్నారు. మళ్లీ కొద్ది రోజులకే సమస్య ఎదురవుతోందని స్థానికులు చెబుతున్నారు. డ్రెయిన్‌లో వ్యర్థాలు నిలిచిపోకుండా, మురుగు నీరు రోడ్డెక్కకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో అపార్ట్‌మెంట్ల ముందున్న డ్రెయిన్లను కాంక్రీట్ పలకలతో మూసి వేయడంతో చెత్త తొలగించే మార్గం లేక తరచూ డ్రెయిన్ బ్లాక్ అవుతోందని, దీనికి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

జీవీఎంసీ చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



ఊర్వశి జంక్షన్ జీవీఎంసీ చలివేంద్రంలో బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న సిబ్బంది



ఆర్ అండ్ బీ బస్‌స్టాప్ వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని పరిశీలిస్తున్న ఎస్ఈ వేణుగోపాల్

కంచరపాలెం: వేసవి కాలం నేపథ్యంలో జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో గురువారం నుంచి తాగునీరుతోపాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, ఆర్ అండ్ బీ జంక్షన్, కరాసా, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని చలివేంద్రాల్లో బాటసారులకు మజ్జిగ అందించామన్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్స్ ఏ అండ్ బీ శ్రీనివాస్, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ విభాగం ఈఈలు సుధాకర్, సూరిశెట్టి శేఖర్ తదితరులు మజ్జిగ పంపిణీని పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ పరిశీలన

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు జాతీయ రహదారి వద్ద ఆర్ అండ్ బీ బస్‌స్టాప్, జంక్షన్‌లోని చలివేంద్రంలో గురువారం బాటసారులకు మజ్జిగ అందజేశారు. జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్‌లు పలు చలివేంద్రాలను సందర్శించారు. అక్కడ సిబ్బంది సరిగ్గా మజ్జిగ పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో జోన్-5 పరిధిలో జ్ఞానాపురం నుంచి ఆర్ అండ్ బీ వరకు మొత్తం 15 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల బాటసారులకు మజ్జిగ అందిస్తున్నామని చెప్పారు. ఎండలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారుల దాహార్తిని తీర్చుకునేందుకు వీలుగా ఉండటం వల్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

పబ్లిక్ డిమాండ్

రహదారిలో ప్రమాదకరంగా గోతులు



కంచరపాలెం నేతాజీ వంతెన రోడ్డులో గోతులు

కంచరపాలెం: కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి రహదారిలోని గోతులు ప్రమాదకరంగా మారాయి. అటు జ్ఞానాపురం.. ఇటు తాటిచెట్లపాలేనికి వెళ్లే జంక్షన్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై జోన్-5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు పరిశీలించి గోతుల పూడ్చివేతకు తగు చర్యలు చేపట్టాలి.

– ఆర్.జి.రమణమూర్తి, కొత్తరెడ్డి కంచరపాలెం

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త నాగమరి శివ, దేవి దంపతులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణతో పాటు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి వారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



అప్పన్న సన్నిధిలో స్వర్ణపుష్పార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ పీ అండ్ టీ కాలనీ, 11 కేవీ ఎస్ఈ లేఅవుట్, 11 కేవీ బీఎల్ లేఅవుట్, 11 కేవీ ఏపీఎస్ఈబీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పీ అండ్ టీ కాలనీ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతం, ఎస్ఆర్ఐ హాస్పిటల్ ఏరియా, బాలయ్యశాస్త్రి లేఅవుట్, విజయ రెసిడెన్సీ, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.